క్లుప్తంగా

టీఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా రాములు



టేకులపల్లి: తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టీఎమ్మార్పీఎస్) టేకులపల్లి మండల కన్వీనర్‌గా మీసాల రాములు ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం అన్ని మండలాల్లో నూతన అధ్యక్షుల నియామకాల్లో భాగంగా ఇల్లెందులో సమావేశం నిర్వహించారు. టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మేకల శ్యామ్ ఆదేశాల మేరకు ఇల్లెందు నియోజకవర్గ అధ్యక్షుడు బోశాల దుర్గారావు.. రాములుకు నియామకపత్రం అందజేశారు. కనకం రమణయ్య, కుక్కముడి రమణయ్య, సిరికొండ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఐక్యంగా పోరాడాలి



ముదిరాజ్ సంఘం సభ్యులు

ఇల్లెందు: అట్టడుగున జీవిస్తున్న ముదిరాజ్ సంఘం బలోపేతం చేసుకుని హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని ఇల్లెందు ముదిరాజ్ సంఘం డివిజన్ అధ్యక్షుడు గ్రంధి సదానందం, జేకే శ్రీనివాస్, సీహెచ్ వెంకన్న, బోళ్ల సాగర్ అన్నారు. శుక్రవారం ఇల్లెందులో పట్టణ, మండల, డివిజన్ కమిటీల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ.. హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో పీకే సాగర్, రాజు, లక్ష్మణ్, పురుషోత్తం, బండి రాజయ్య, బోళ్ల సూర్యం, వెంకన్న, గూళ్ల పోషయ్య, పెండ్యాల రాజు, గాజుల సతీష్, బి. శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణ, మండల, డివిజన్ నూతన కమిటీలను ఎన్నుకున్నారు.

స్ప్రేయర్లను సద్వినియోగం చేసుకోండి



స్ప్రేయర్లు అందజేస్తున్న సురేందర్‌రావు

టేకులపల్లి: పంట పొలాల్లో మందులను పిచికారీ చేసే స్ప్రేయర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బేతంపూడి సొసైటీ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ లక్కినేని సురేందర్‌రావు సూచించారు. వరంగల్‌కు చెందిన అగ్రిటెక్ నుంచి వ్యవసాయ పనిముట్ల డీలర్ షిప్‌ను బేతంపూడి సహకార సంఘం తీసుకున్న సందర్భంగా శుక్రవారం స్ప్రేయర్ల విక్రయాలను ఆయన ప్రారంభించారు. నాణ్యమైన వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలు బేతంపూడి సొసైటీలో తక్కువ ధరలకే అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సీఈఓ పొన్నోజు ప్రేమాచారి, కందుల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ ఊకె రామకృష్ణ పాల్గొన్నారు.

దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

కొత్తగూడెంరూరల్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కల్వ సుజాతను శుక్రవారం హైదరాబాద్‌లో పొంగులేటి యువసేన జిల్లా అధ్యక్షుడు మద్దెల సుధీర్ కలిశారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని అధైర్యపడొద్దన్నారు. రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. కాంగ్రెస్‌ను ఎలా ఎదుర్కోవాలో అర్థం కాని బీఆర్‌ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

శిథిలావస్థలో.. లోలెవల్ వంతెన

- ఏ క్షణమైనా కూలిపోయే ప్రమాదం
- మూడేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం



శిథిలావస్థకు చేరుకున్న లోలెవల్ బ్రిడ్జి

చుంచుపల్లి: కొత్తగూడెం- పెనుబల్లి గ్రామాలను కలిపే లోలెవల్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. గడిచిన రెండేళ్లుగా దీన్ని పట్టించుకునే నాథుడే లేడు. మండల పరిధిలో మేజర్ పంచాయతీల్లో ఒకటైన పెనుబల్లి గ్రామ ప్రజలకు ప్రతి వర్షాకాలంలో అవస్థలు తప్పడం లేదు. ఏళ్లు గడుస్తున్నా గ్రామస్తులకు వారధి కష్టాలు తీరడం లేదు. పెనుబల్లి గ్రామంలో రెండు వేల మంది జనాభా. కొత్తగూడెం పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరం. గ్రామస్తులు ప్రతి అవసరానికి రోజూ జిల్లా కేంద్రానికి రావాల్సిందే. పెనుబల్లి- కొత్తగూడెం పట్టణాల మధ్య గోధుమ వాగు ఉంది. ఈ వాగుపై నిర్మించిన లోలెవెల్ వంతెన రెండు గ్రామాల మధ్యన వారధిగా నిలుస్తోంది. ఈ లోలెవల్ వంతెనను దాదాపు 20 ఏళ్ల క్రితం నిర్మించారు. నిత్యం గ్రామస్తులతో పాటు ఇతర అవసరాల నిమిత్తం దీని మీదుగా పలు రకాల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రజలు సైతం కొత్తగూడెం పట్టణానికి రావాలంటే ఈ బ్రిడ్జి మీదుగా కాలినడకనే వస్తుంటారు. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరి ప్రమాద భరితంగా తయారైంది. బ్రిడ్జి పైన పలుచోట్ల గుంతలు పడి బీటలు వచ్చాయి. వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణ దిమ్మెలు సైతం ధ్వంసమయ్యాయి. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఈ వంతెన పూర్తిగా దెబ్బతిన్నది. మే క్షణమైనా కూలిపోయే స్థితిలో ఉంది.

ఏటా వరద కష్టాలు..

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో మళ్లీ ప్రజలకు అవే అవస్థలు మొదలవుతాయనే ఆందోళనలో ఉన్నారు. వర్షం వస్తే చాలు.. పెనుబల్లి గ్రామానికి కొత్తగూడెం పట్టణానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతుంటాయి. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. వరద ఉధృతి తగ్గిన తర్వాత మళ్లీ వంతెన పైనుంచి రాకపోకలు కొనసాగడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో గ్రామస్తులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. మూడేళ్ల క్రితం రూ.3.50 కోట్ల అంచనాలతో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి చేతులు దులుపుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులూ పట్టించుకున్న పాపానపోలేదు. ఎలక్షన్లు వచ్చినప్పుడల్లా నాయకులు ఓట్ల కోసం వచ్చి బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చి పోతుంటారు. గెలిచిన తరువాత షరా మామూలే. ఇటువైపు కన్నెత్తి చూడరు. ఇప్పటికైనా పెనుబల్లి గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అధికారులు, పాలకులు కొత్త బ్రిడ్జి నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు చొరవ చూపాలి



పెనుబల్లి–కొత్తగూడెం లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ప్రతి వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శిథిలావస్థకు చేరిన వంతెనపై నడవాలంటేనే భయంగా ఉంది. అధికారులు మూడేళ్ల క్రితం కొత్త వంతెన నిర్మాణానికి అంచనాలు వేశారు. ఆ తరువాత దాని గురించి పట్టించుకో లేదు.

– కంటెం శ్రీనివాసరావు, సర్పంచ్, పెనుబల్లి

ప్రతిపాదనలు పంపాం



పెనుబల్లి లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలం దీనిపై నుంచి వరద పోవడం వల్ల గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరడంతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు కొత్త వంతెన కోసం ప్రతిపాదనలను పంపారు. మంజూరైతే కొత్త బ్రిడ్జి నిర్మించే అవకాశం ఉంది.

– జి.సత్యనారాయణ, ఎంపీడీఓ

మాలలకు అన్యాయం జరగొద్దు



ఎమ్మెల్యే హరిప్రియతో మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

ఇల్లెందు: ప్రభుత్వం ప్రకటించే పథకాలలో మాలలకు అన్యాయం జరుగుతోందని, ఇక మీదట దామాషా పద్ధతి ప్రకారం ఏ పథకమైనా వర్తింపజేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ కోరారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో ఇల్లెందులో ర్యాలీ నిర్వహించి జగదాంబా సెంటర్‌లో దీక్ష చేపట్టారు. అంతకు ముందు జేకేలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే హరిప్రియను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలే పుల్లయ్య, బట్టు శ్రీనివాస్, అబ్బూరి సునిల్, పండుగ ప్రసాద్, బీఎస్ గోపాల్, నంద ప్రవీణ్, గడ్డి శ్రీను, వేమూరి సాల్మాన్‌రాజ్, బాబూరావు, గూడ బాబూరావు, బాణాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభకు వెళ్లారని బొగ్గు లోడింగ్ నిలిపివేత

ఇల్లెందు: ఇటీవల ఖమ్మంలో జరిగిన కాంగ్రెస్ సభకు లారీలు సమకూర్చామనే కక్షతో తమకు బొగ్గు లోడింగ్ ఇవ్వడం లేదని పలువురు లారీల యజమానులు వాపోయారు. గత 12రోజులుగా బొగ్గు లోడింగ్ ఇవ్వకపోవడంతో యజమానులు రాము, రహీం, విజయ్, కరీం, షబ్బీర్, సుభానీ, మోహిన్, హైమద్, బాలకృష్ణ, శేఖర్, వెంకట్రావు, నూరుద్దీన్ తదితరులు శుక్రవారం ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అద్దెకు వెళ్లినా తమపై కక్షసాధింపు సాధిస్తున్నారని ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని కోరారు.

ఈ విషయమై లారీ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు రవి మాట్లాడుతూ... బొగ్గు కోసం సీరియల్‌లో పెట్టినట్లే జనం కోసం కూడా అసోసియేషన్‌ను సంప్రదిస్తే సీరియల్ ప్రకారం అవకాశం కల్పించేవారమని తెలిపారు. ఈ విషయాన్ని ముందు చెప్పినా యజమానులు వినలేదని పేర్కొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా డ్రైడే.. ఫ్రైడే



కోయగూడెంలో వైద్య శిబిరం

టేకులపల్లి: సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ ఆదేశానుసారం శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సులానగర్ పరిధిలో అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది డ్రైడే – ఫ్రైడే నిర్వహించారు. ప్రజలతో ఆరోగ్య సమావేశాలు, వైద్య శిబిరాలు నిర్వహించారు. నిల్వ ఉన్న నీటిలో లార్వా ఉన్న చోట యాంటీ లార్వా చల్లించి, ఆయిల్ బాల్స్ వేయించారు. పరిశుభ్రమైన ఆహారం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని ప్రజలకు వైద్య సిబ్బంది సూచించారు. కోయగుడెంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సీతమ్మ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు పేరు నమోదు చేసుకుని టీకా, ఐరన్ ఫోలిక్ యాసిడ్, కాల్షియం టాబ్లెట్లు తీసుకోవాలని చెప్పారు. రక్తహీనత పోషకాహార లోపం నివారణకు ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న న్యూట్రిషన్ కిట్స్‌లో పౌష్టికాహార పదార్థాలు ఉన్నట్లు చెప్పారు. వాటి ద్వారా తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, నాగబండి వెంకటేశ్వర్లు, వీసం శకుంతల, గుజ్జ విజయ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తత



ఒడ్డుగూడెంలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ లోహిత

ఇల్లెందురూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉంటేనే ఆరోగ్యవంతులుగా ఉంటారని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లోహిత సూచించారు. మండలంలోని ఒడ్డుగూడెం, దేశ్యాతండా, రామకృష్ణాపురం గ్రామాలలో కొమరారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఆరోగ్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య పరిరక్షణకు వ్యక్తిగతంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. అనంతరం ప్రజాప్రతినిధులతో కలిసి ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. మాట్లాడుతూ.. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఇంటి ఆవరణలో ఖాళీ పాత్రలలో నిల్వ ఉండే నీరు దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా ఉంటాయని చెప్పారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పలు ఇళ్లల్లోకెళ్లి నిల్వ ఉన్న నీటిని తొలగించారు. సర్పంచ్‌లు చాట్ల బాగ్యమ్మ, మోకాళ్ల కృష్ణ, రజిత, కార్యదర్శులు మల్లేష్, రజియా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ ప్రవేశపెట్టిందే కాంగ్రెస్..



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లెందు: దివంగత సీఎం డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి పాదయాత్రలో రైతుల కష్టాలను కళ్లారా చూశాక ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేశారనే విషయాన్ని బీఆర్‌ఎస్ నేతలు గుర్తించాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు డి.డానియేల్, నాయకులు భూక్యా దళ్‌సింగ్‌నాయక్, డాక్టర్ బి.రాంచందర్ నాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్‌ను కాంగ్రెస్ ప్రవేశపెట్టిన విషయాన్ని మరిచిపోయి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకుడు హరిసింగ్ తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే సీటు రేవంత్‌రెడ్డితో వచ్చిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈసారి టికెట్ రాదనే భయంతోనే రేవంత్‌ను దూషిస్తున్నారని విమర్శించారు. నాయకులు సుదర్శన్‌కోరీ, నందకిషోర్, దేవ నాయక్, రామస్వామి, శంకర్, ఐజాక్, శ్రీనివాస్, మసూద్, జీవీ భద్రం, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనేతరులకూ పోడు పట్టాలివ్వండి

పాల్వంచరూరల్: గిరిజనేతరులకు కూడా పోడు పట్టాలు ఇచ్చి సమస్యను పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బంద్రుగొండ, కొయ్యగుంపు గ్రామాల్లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న పేదలందరికీ పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిన సీఎం కొంతమందికి మాత్రమే పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఒక రైతుకు రెండు, మూడు చోట్ల పోడు భూమి ఉంటే ఒక్క పట్టా మాత్రమే ఇచ్చారని ఎస్సీ, బీసీ, ఓసీ, వలస ఆదివాసీ గిరిజనులకు పట్టాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పేద రైతులందరని గుర్తించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కుంజ రమేష్, గోవర్ధన్, కె.వీరేష్, ఎం.భద్రయ్య, జోగారావు, లక్ష్మయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 21వ తేదీన స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థినులు అడ్మిషన్ల కోసం ఈనెల 20వ తేదీ లోపు కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థినులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను, ఫీజు రూ.200 తీసుకురావాలని కోరారు. వివరాలకు 8106257520, 9951830441 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇంటి నిర్మాణ పనుల అడ్డగింత



ఇంటి నిర్మాణ పనులను అడ్డుకున్న ఈఓలు సులోచన, రజనీకుమారి

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలోని గుడిపాడు గ్రామంలో శ్రీ మోక్ష వేంకటేశ్వర స్వామి ఆలయ దేవస్థానానికి చెందిన భూమిలో అనుమతి లేకుండా పూనెం శ్రీకాంత్ ఇట్లు నిర్మిస్తుండగా శుక్రవారం పెద్దమ్మగుడి ఈఓ ఎస్.రజనీకుమారి, గణేష్‌టెంపుల్ ఈఓ సులోచన అడ్డుకున్నారు. ఇప్పటి వరకు నిర్మించిన నిర్మాణాలను రెండు, మూడు రోజుల్లో తొలగించాలని లేదంటే దేవదాయశాఖ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డ్రెయినేజీ లేక అవస్థలు



ఇంటి ముందు చేరిన వరద

సుజాతనగర్: మండలంలోని వేపలగడ్డ గ్రామస్తులకు కొత్త కష్టాలు మొదలయ్యాయి. రోడ్డు విస్తరణలో భాగంగా ఈ గ్రామ పరిధిలో నాలుగు లేన్ల రహదారిని నిర్మిస్తున్నారు. 12వ రాష్ట్రీయ రహదారి విస్తరణలో భాగంగా రైల్వే లైన్ నిర్మాణంలో గాయత్రీనగర్ వద్ద చేపట్టిన ఆర్వోబీ వంతెన పనులతో పాటు, రోడ్డు విస్తరణ పనులు చాలా వరకు పూర్తయ్యాయి. ఈ పనులకు గాను దక్షిణ మధ్య రైల్వే రూ.45 కోట్లు కేటాయించింది. ఇంతవరకు బాగానే ఉన్నా ఈ పనుల్లో డ్రెయినేజీ నిర్మాణాల ఊసే లేదు. రహదారి పక్కన రెండువైపులా సుమారు 60 ఇళ్ల వరకు ఉన్నాయి.

ఇప్పటికే ఒకపక్క రహదారి నిర్మాణం పూర్తయింది. వర్షం వచ్చినప్పుడు వరదంతా ఇళ్లలోకి చేరుతోంది. ఆవాసాలన్నీ వరద, బురదగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరదతో కొట్టుకొచ్చిన చెత్తచెదారం ఇళ్లలోకి చేరుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సైడు కాల్వలు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

గురుకుల టీచర్ల సమస్యలపై 17న దీక్ష



మాట్లాడుతున్న మహేష్

ఇల్లెందురూరల్: గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 17వ తేదీన దీక్ష చేపట్టనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ ఉమ్మడి జిల్లా బాధ్యులు మహేష్, జిల్లా అధ్యక్షుడు కిషోర్‌సింగ్ తెలిపారు. ఇల్లెందులోని టీఎంఆర్‌ఎస్‌లో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడారు. గురుకుల విద్యార్థులు సాధించిన విజయాల వెనుక ఉపాధ్యాయుల శ్రమ, అంకితభావం ఉన్నాయని గుర్తుచేశారు. ఉపాధ్యాయులు విద్యాబోధనతోపాటు బోధనేతర కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కానీ వారి శ్రమకు తగినట్లుగా వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉపాధ్యాయులను బోధన విధులకు పరిమితం చేయడంతోపాటు సమయపాలన విధించాలని కోరారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 17న జిల్లా కేంద్రంలో, ఆగస్టు 5న రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జయరాజు, హథిరాం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న బాలరాజు

పాల్వంచరూరల్: పుస్తక పఠనంతో విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందని సామాజిక కార్యకర్త లిక్కి బాలరాజు అన్నారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు.

విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలు మాత్రమే కాకుండా ఇతర పుస్తకాలను కూడా చదవాలన్నారు. నాడు స్వాతంత్ర్య సమరయోధులు గ్రంథాలయాలను ఏవిధంగా ఉపయోగించుకున్నారో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ, పుల్లారెడ్డి, ఆర్.కృష్ణ, ఉపాధ్యాయులు దేవిశ్రీ, డి.సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చుని నిరసన



నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు డిమాండ్ల సాధనకై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమం శుక్రవారంకు అయిదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా రూ.3వేల వేతనం ఇస్తానని జీఓ ఇచ్చి 16 నెలలు కావస్తున్నా, నేటికీ జీఓ అమలు కాకపోవటం సిగ్గుచేటన్నారు. మహిళలకు ఇచ్చిన మాట తప్పటం తగదన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల సాధనకై ఈనెల 15న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఇల్లును ముట్టడించనున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికుల అందరూ సకాలంలో ఎమ్మెల్యే ఇంటి ప్రాంగణానికి చేరుకుని ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయలక్ష్మి, ఎండీ యూసఫ్, ప్రభావతి, మంగలక్ష్మి, క్రాంతి, వెంకటమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సహకరించండి

జీపీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 6న ప్రారంభమైన సమ్మె శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరింది. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జీపీ కార్మికులు ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. సమస్యలు పరిష్కామయ్యే వరకు తమకు సహకరించాలని కోరారు. సమ్మె శిబిరాలను సీఐటీయూ, ఇఫ్టూ, ఏఐకేఎంఎస్, కాంగ్రెస్, బీఎస్పీ, సేవాలాల్ సేన నాయకులు సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. మాట్లాడుతూ.. జీపీ కార్మికులను పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించి, నెలసరి వేతనం రూ.19,500 ఇవ్వాలన్నారు. కార్మికుల పనిభారాన్ని పెంచే జీఓ 51ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



సింగరేణి(కొత్తగూడెం): కార్మికులకు మద్దతు తెలుపుతున్న ఇఫ్టూ నాయకులు



పాల్వంచరూరల్: జీపీ కార్మికులకు మద్దతు తెలుపుతున్న నాగా సీతారాములు



ఇల్లెందురూరల్: దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు రవి



సుజాతనగర్: ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు



టేకులపల్లిలో కార్మికులకు సంఘీభావం తెలిపి పండ్లు అందజేస్తున్న బీఎస్పీ నాయకులు



జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీని కలిసిన జీపీ కార్మికులు



ఇల్లెందురూరల్: వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు



అటెన్షన్ ప్లీజ్

డ్రెయినేజీ నిర్మించరూ..!



ఇల్లెందు మండలంలోని సుభాష్‌నగర్ గ్రామ పంచాయతీ పదో వార్డులో డ్రెయినేజీ నిర్మించేందుకు ప్రహరీలు అడ్డుగా ఉన్నాయని ప్రజాప్రతినిధులు చెప్పడంతో నెల రోజుల క్రితం ఆ వీధిలోని ఇంటి యజమానులు ఇళ్ల ప్రహరీలను కూల్చివేశారు. కానీ ఇంత వరకు ఎవరూ అటుగా చూడకపోవడం, ప్రశ్నించినా దాటవేస్తున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ నిర్మాణం చేపట్టేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. – ఇల్లెందురూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : రజినీకాంత్,
కార్యదర్శి, సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ
సెల్ నెంబర్: 9966142448